# పురుషలక్షణం

## -ప్రతాప రవిశంకర్

చంద్రమోహన్ ఇంట్లోకి వచ్చేసరికి హాల్లో కూర్చుని తల్లితో మాట్లాడుతున్న అందమైన అమ్మాయి కనపడింది. ఆ అమ్మాయే కల్పన అయి ఉంటుందనుకున్నాడు. కొడుకును చూడడంతోనే తల్లి శారద ఆ అందమైన అమ్మాయిని కల్పనగా అతనికి పరిచయం చేసింది.

చంద్రమోహన్ చిరునవ్వుతో “హాయ్” అన్నాడు. కల్పన కూడా అదే చిరునవ్వుతో తిరిగి “హాయ్” అంది. శారద మళ్లీ ఆ అమ్మాయితో మాట్లాడ్డంతో అతను తన గదిలోకి వెళ్లిపోయాడు.

తల్లి మాటలు అతనికి వినపడుతూనే ఉన్నాయి. ఆమె తన చిన్నతనంలో జరిగిన ఏదో సంఘటన గురించి పూసగుచ్చినట్టు చెబుతోంది. తల్లి ఎప్పుడూ అంతే. ఏది చెప్పినా ఎంతో వివరంగా చెబుతుంది. అందుకే తండ్రి శివరాం ఎప్పుడూ అంటూ ఉంటాడు ఆమె రచయిత్రయితే బావుండేదని. కల్పన రూపమే కాకుండా ఆమె నవ్వు కూడా అతనికి బాగా నచ్చింది. అతను ప్యాంటు, షర్టు విప్పి లాల్చీ, పైజమా వేసుకుని రిలాక్సింగ్‌గా కుర్చీలో కూర్చున్నాడు. ఎందువల్లనో తండ్రి ఇంకా ఇంటికి రాలేదు ఆఫీసు నుంచి. రెండ్రోజుల క్రితం తన స్నేహితుడు విశ్వనాథం దగ్గర్నించి వచ్చిన ఉత్తరాన్ని చదివి అందులో కల్పన వస్తుందనే విషయాన్ని తల్లితో చెబుతుంటే అతను విన్నాడు.

ఈమధ్యనే కల్పనకు ఓ ఉద్యోగం వచ్చింది. అందుకు సంబంధించి ఓ ఇరవై రోజుల ట్రైనింగ్ ప్రోగ్రాం హైదరాబాద్‌లో ఉందిట. ఎక్కడో ఊరికి దూరంగా ఆ ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న ఎకామడేషన్‌లో బసచేయడం ఆమెకు ఇష్టం లేదు. అందుకే ట్రైనింగ్ పూర్తయ్యే వరకూ కల్పన - శివరాం వాళ్ల ఇంట్లో ఉంటుందని ఆమె తండ్రి విశ్వనాథం ఆ ఉత్తరంలో రాశాడు.

ఆ ఉత్తరం వచ్చిన రాత్రి శారద కొడుకుతో కల్పన తండ్రీ, తన తండ్రీ మంచి స్నేహితులని చెప్పింది. అంతేకాకుండా కల్పన మంచి అమ్మాయనీ, అందం, తెలివితేటలు ఉన్నాయనీ తన కంటే ఏడాదిన్నర చిన్నదనీ కూడా చెప్పింది. అప్పుడే చంద్రమోహన్‌లో కల్పనను చూడాలనే క్యూరియాసిటీ కలిగింది. తల్లి చెప్పినట్టుగానే కల్పన అందంగా ఉందని అనుకున్నాడతను. విశాలంగా ఉన్న కళ్లు, తీర్చిదిద్దినట్టున్న కనురెప్పలు, నున్నని బుగ్గలు, మొనతేలిన గడ్డం, శంఖం లాంటి మెడ, కొంచెం పొడవుగా మంచి శరీరచాయతో మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంది. చంద్రమోహన్‌కయితే తను కూడా వెళ్లి వాళ్ల దగ్గర కూర్చోవాలని అనిపించింది. కానీ బావుండదని ఊరుకున్నాడు.

రాత్రి ఎనిమిదిన్నర కావస్తున్నప్పుడు తండ్రి వచ్చాడు. ఆయన రావడంతోనే కల్పనను పలకరించి కొంచెంసేపు మాట్లాడాడు. ఆయన స్నానం చేసి వచ్చాక తల్లి అందరికీ భోజనాలు వడ్డించింది.

డైనింగ్ టేబిల్ దగ్గర కూర్చున్నప్పుడు కల్పన అడిగింది శివరాంని చంద్రమోహన్ ఏం చేస్తున్నాడని. అందుకు ఆయన జవాబు చెప్పకుండా నవ్వి ఊరుకున్నాడు. అలాగని కల్పన ఊరుకోకుండా “ఉద్యోగ ప్రయత్నాలా?” అని అడిగింది. ఈసారి ఆయన అవునన్నాడు.

కల్పన ఎదురుగా ఎందువల్లనో చంద్రమోహన్ ఏమీ మాట్లాడలేకపోయాడు. తన గదిలో కూర్చున్నప్పుడు ఆమెతో చాలా మాట్లాడాలనుకున్నాడు. తల్లి, తండ్రి అక్కడే ఉండటంతో అతను మౌనాన్ని ఆశ్రయించాడు. కల్పన మాత్రం కబుర్లు చెబుతూ ఎలాంటి బెరుకూ లేకుండా హాయిగా భోజనం చేసింది. చివరకు శారద వంట చాలా బాగుందని మెచ్చుకుంది. ఆ మెచ్చుకోలు శారదకు సంతోషాన్ని కలిగించింది. శారద ఆ ఇంట్లో ఖాళీగా ఉన్న మరో గదిని కల్పనకు ఇచ్చింది. రాత్రి పది గంటలు కూడా అవకముందే ప్రయాణ బడలిక వల్ల కల్పన నిద్రలోకి జారిపోయింది. కానీ కల్పన గురించి ఆలోచిస్తూ చంద్రమోహన్ మాత్రం ఆ రాత్రి ఎప్పటికో నిద్రపోయాడు. ఆ మర్నాడు ఉదయం ఎనిమిది గంటల సమయంలో తండ్రి చంద్రమోహన్‌తో చెప్పాడు. కల్పనను హీరోహోండా మీద ట్రైనింగ్ సెంటర్ దగ్గరకు తీసుకువెళ్లమని. సంతోషంగా ఒప్పుకున్నాడు. అతను కూడా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు. రోజూ అయితే చంద్రమోహన్ ఉదయం ఎనిమిది గంటల వరకూ నిద్రపోయేవాడు. కానీ కల్పన ఉందని అతను కొంచెం ఎర్లీగా నిద్రలేచాడు. ఇదే విషయాన్ని శారద భర్తతో చెప్పి నవ్వింది.

“శ్రమనుకుంటే వద్దు.. నేను బస్సులో వెళతాను” అన్నది రెడీ అయి.

అతను జవాబుగా నవ్వి “ఇందులో శ్రమ ఏముంది?” అన్నాడు.

కల్పన లేతగులాబి రంగు చీర కట్టుకుని మేచింగ్‌గా అదే రంగు జాకెట్టు వేసుకున్నది. ఆ డ్రెస్ ఆమె శరీరం రంగులో కలిసిపోయింది. ఇద్దరూ బయల్దేరారు. చంద్రమోహన్‌కు అదోలా ఉంది. కల్పన మాత్రం బాగా అలవాటయినదానిలా కూర్చుంది. రివ్వున ముందుకి పోతోంది హీరోహోండా. ఆమె మౌనంగా ఉండటంతో “ఏదయినా మాట్లాడండి” అన్నాడతను.

“లేకపోతే డ్రైవ్ చెయ్యలేరా?” అన్నది నవ్వుతూ.

“చెయ్యగలను కానీ మాట్లాడుతూ వెళ్తే బావుంటుందని.”

“సరే...మీరు ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు గదా. వేటికి ప్రిపేర్ అవుతున్నారు?”

చంద్రమోహన్ గొంతు మూగబోయింది: అతను జవాబు చెప్పటానికి మాటలను వెతకాల్సిన అవసరం ఏర్పడింది.

“చెప్పండి.. ఈమధ్య రైల్వేలో పోస్టులు పడ్డాయి కదా?”

“అలాగా” అన్నాడతను తేలిగ్గా.

“భలేవారే...మీకు తెలీదా? మరయితే గ్రూప్ వన్ కోసం ఎదురుచూస్తున్నారా?”

అతను ఆమె మాటలు పట్టించుకోకుండా “ఈమధ్య వచ్చిన కొత్త సినిమాలు ఏం చూశారు?” అనడిగాడు.

కల్పన అతను టాపిక్ మారుస్తున్నాడని అర్థం చేసుకుని “ఏమీ చూళ్లేదు” అన్నది.

“ఎందుకు?” అన్నాడతను ఎదురుగా ఏదో వెహికల్ రావడంతో సడన్ బ్రేక్ వేసి.

కల్పన అతని మీద పడబోయి అతని భుజాన్ని గట్టిగా పట్టుకుని “కుదర్లేదు” అన్నది. ఆమె రాసుకున్న పౌడరు వాసన అతనికి తగిలింది. అది తమ ఇంట్లో వాడే పౌడర్ కాదని అనుకున్నాడు. ఆమె ప్రత్యేకంగా తెచ్చుకుని ఉంటుంది. కల్పనని ట్రైనింగ్ సెంటర్‌లో దింపి అతను ఇంటికి వచ్చి ఆమె ఫోన్ కోసం ఎదురుచూశాడుగానీ చెయ్యలేదు. సాయంత్రం ఆరున్నరకు బస్సులో వచ్చింది. ట్రైనింగ్ విశేషాల గురించి శారదతో చెప్పింది. ఆ తర్వాత వద్దన్నా వినకుండా ఆమెకు వంటపనిలో సహాయపడింది. ఆ సాయంత్రం చంద్రమోహన్ ఫ్రెండ్స్‌తో గడపటానికి బయటకు వెళ్లలేదు. తన

గదిలో కూర్చుని ఏవో పాత పత్రికలను తిరగేశాడు.

అతను ఆ పనిలో ఉండగానే గుమ్మం దగ్గరకు వచ్చి కల్పన "లోపలకు రావచ్చా?'' అన్నది.

"రండి...రావచ్చు'' అన్నాడతను కుర్చీలోనించి లేచి. ఆ గదిలో ఇంకో కుర్చీ లేదు. అందుకని అతను బెడ్‌మీద కూర్చుని ఆమెకు కుర్చీ ఇచ్చాడు.

కూర్చుని "మీ దగ్గర నవల్లు ఏవైనా ఉన్నాయా'' అని అడిగింది.

"ఒకే ఒక్క నవల ఉంది. చూడండి'' అంటూ ఒక క్రయిమ్ నవలను ఇచ్చాడు. ఆమె దాన్ని చూసి

"ఇంకేమీ లేవా?'' అని అడిగింది.

లేవన్నాడు. బెడ్ మీద ఉన్న పాత పత్రికలను చూసి వాటిని అడిగి తీసుకుంది.

"రాత్రిపూట ఏదో ఒకటి చదువుతూ ఉంటేగానీ నాకు నిద్ర రాదు. ఇవి తీసుకెళతాను. థాంక్స్'' ఆ గదిలో నించి వెళ్లింది కల్పన. ఆ అమ్మాయి ఇంకొంచెంసేపు తన ఎదురుగా కూర్చుని కబుర్లు చెబితే బావుండుననుకున్నాడతను. పోనీ కొంచెం సేపు కూర్చోమని అడగాలనుకున్నాడు వెళ్లేటప్పుడు. ఆ రాత్రి కూడా అతను నిద్రకు దూరమైనాడు.

తెల్లవారాక కల్పన వెళ్లటానికి సిద్ధమవుతున్నప్పుడు చంద్రమోహన్ కూడా రెడీ అయ్యాడు. కానీ ఆమె ఆ రోజు బస్సులో వెళతానని అన్నది. శారదా, శివరాం ఆమెను చంద్రమోహన్ బైకు మీద డ్రాప్ చేస్తాడని అన్నారుగానీ కల్పన వద్దన్నది.

"రోజూ ఉన్నదేగా.. బస్సులో వెళతాను'' అని బయల్దేరింది. ఆమె అలా వెళుతున్నప్పుడు చంద్రమోహన్ మొహం వెలవెలపోవడాన్ని వాళ్లు గమనించారు. సాయంత్రం ఐదున్నర కావస్తున్నప్పుడు కల్పన ట్రైనింగ్ సెంటర్ నించి బయటకు రాగానే రోడ్డు పక్కన ఉన్న చెట్టు కింద చంద్రమోహన్ బైకు పక్కన నిలబడి కనిపించాడు. ఆమె అంతగా ఆశ్చర్యపడకుండా అతనితో "ఎందుకు నా గురించి శ్రమ తీసుకుంటున్నారు?'' అన్నది.

"మీరు మా గెస్ట్ కాబట్టి'' అన్నాడు నవ్వి బైక్ స్టార్టు చేస్తూ.

ఆమె వెనుక కూర్చుంది.

వెళుతున్నప్పుడు "సడన్ బ్రేకు వేసే ముందు చెప్పండి'' అన్నది.

అతను నవ్వి "సర్లెండి'' అన్నాడు.

దార్లో అతను ఓ రెస్టారెంట్ ముందు ఆపాడు కాఫీ తాగి వెళ్దామంటూ. ఆమె కాదన్లేదు. నిజానికి ఆమెకీ మంచి కాఫీ తాగాలని ఉంది. టీ బ్రేకంటూ టీ ఇచ్చారుగానీ బావుండ్లేదు. వట్టినీళ్లు...

జనం నిండుగా ఉన్నారు.

"టిఫిన్ తీసుకుంటారా?''

"వద్దు''

కాఫీ బావుంది. ఇంకో కప్పు తాగాలనిపించింది. అచ్చం తమ ఇంట్లో కాఫీలాగానే ఉంది. అతనికి థాంక్స్ చెప్పింది.

"మంచి హిందీ సినిమా ఆడుతోంది. వెళదామా?''

ఆమె నవ్వి అన్నది. "మీకు గర్ల్ ఫ్రెండ్సున్నారా?''

"లేరు..ఎందుకు?''

"ఉన్నట్టుగా మాట్లాడుతున్నారు. అందుకు''

"అదా...''

"అవును. నేనిక్కడకు వచ్చిన రెండు రోజులకే ఇంత చొరవ తీసుకుంటే అనుమానం వచ్చింది. సాధారణంగా గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నవాళ్లే ఇలాంటి చొరవ తీసుకోగలరు.''

"ఫ్రెండ్లీగా అడిగాను''

"రాను. ఇంట్రెస్టు లేదు''

చంద్రమోహన్ బలవంతపెట్టలేదు. ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఆమెను దించి తను మళ్లీ ఎవర్నో కలవాలని వెళ్లాడు. అలా వెళ్లినవాడు రాత్రి ఎప్పటికో వచ్చాడు. అతను రావడం కల్పనకు తెలీదు. నిద్రలో ఉంది. నాలుగు రోజుల తర్వాత ఆదివారం వచ్చింది. ఆ రోజు కల్పనకు కూడా సెలవే కావడంతో ఆ సాయంత్రం చంద్రమోహన్ ఎగ్జిబిషన్‌కు వెళదామని అడిగాడు కల్పనని. వస్తానని అన్నది. అని శారద దగ్గరకు వెళ్లి ఆమెను కూడా రమ్మని అడిగింది. శివరాం ఇంట్లో లేడు.

"మీరిద్దరూ బైకుమీద వెళ్లిరండి. నేను గుడికి వెళతాను. ఎవరో స్వామీజీ వచ్చారట.''

దార్లో అన్నాడు అతను "థాంక్స్''

"ఎందుకు?''

"ఎగ్జిబిషన్‌కు వస్తున్నందుకు.''


"నాకూ రావాలని ఉంది. అందుకే బయల్దేరాను.''


"ఐతే మీకు రావాలని లేకపోతే రానని చెప్పేవారేనా?''

"అవును తప్పకుండా.''

"నాకోసమైనా వచ్చేవారు కాదా?''

"మీకోసం ఎందుకు రావాలి?'' అనడిగింది కల్పన.





## వారే చెప్పాలి

రింకీఖన్నా లండన్‌లో సెటిలైతే డింపుల్ కపాడియా ఇప్పుడు తల్లి, అత్త పాత్రలతో సంతృప్తి పడుతోంది. యువ అందాలతో కనువిందుచేసే హీరోయిన్లకే కాలం చెల్లిపోతున్న తరుణంలో ఇలాంటి మార్పులు సహజమే కదా అంటున్నారంతా. అన్నట్టు మహేష్‌బాబు హీరోగా నటిస్తున్న 'నాని' సినిమాలో ఆమె అత్త పాత్ర పోషిస్తోంది. దీంతో ఆమె ఎలాంటి పాత్రలు చేయడానికైనా సిద్ధంగా ఉందన్న సంకేతాలు నిర్మాత, దర్శకులకి చేరుతున్నాయి. ఈమె అభిమానులు మాత్రం కొంచెం గ్లామర్ ఉన్న పాత్రల్లో నటిస్తే చూడాలని ఉందంటున్నారు. వీరి కోరిక నెరవేరే అవకాశాలున్నాయేమో నిర్మాత, దర్శకులే చెప్పాలి.

అతనికేం చెప్పాలో తెలీలేదు. ఎగ్జిబిషన్‌లో ఆమె ఓ నెయిల్ పాలిష్ బాటిల్ కొన్నది. ఇద్దరూ చైనా అప్పడాన్ని తిన్నారు. జైంట్ వీల్ ఎక్కుదామన్నాడు. ఆమె కాదనలేదు. ఎక్కారు. అతనికి ఆమె పక్కనే కూర్చుని జెయింట్‌వీల్ తిరగడం సంతోషమనిపించింది.

తర్వాత "ఇదో గొప్ప మరచిపోలేని అనుభవం" అన్నాడతను.

"ఇంతకు ముందు ఎప్పుడూ ఎక్కలేదా?" అన్నది వెంటనే.

"అలాగని కాదు మీతో కలిసి ఎక్కటం"

"ఇంతేకదా"

చివరికి ఒకచోట కూర్చున్నారు.

చంద్రమోహన్ రెండు ఐస్‌క్రీంలను తీసుకువచ్చాడు.

తింటూ అడిగింది. "ఇంతకీ మీరు ఎలాంటి ఉద్యోగాన్ని చేయాలనుకుంటున్నారు?"

అతను మళ్లీ మాటలను వెతుక్కున్నాడు.

"చెప్పండి...మీ ధ్యేయం ఏమిటి?"

ఇక ఆమెను మభ్యపెట్టడం ఇష్టం లేక-

"నిజం చెప్పమంటారా?" అనడిగాడు.

"మీరు అబద్ధాలు కూడా చెబుతారా?"


"అవును చెబుతాను. ఈ విషయంలో మాత్రం మీకు నిజం చెబుతాను. నిజానికి నాకు ఎలాంటి ఉద్యోగం చెయ్యటమూ ఇష్టంలేదు."

"ఎందుకని?"

"నిజానికి నాకు అంత అవసరం కూడా లేదు. మీకు తెలుసు. నేనొక్కడినే కొడుకుని. చాలా ఆస్తి ఉంది. ఈ ఊళ్లోనే ఇంకో రెండిళ్లున్నాయి. సొంత ఊళ్లో కొంచెం పొలం ఉంది. అద్దె, కౌలు బాగానే వస్తాయి. నాన్నగారు ఇంకా ఉద్యోగం చేసి సంపాదిస్తున్నారు. ఇదంతా నాదే. ఇంకా ఉద్యోగం చేయడం ఎందుకు?"

"అంతేగానీ.. ఉద్యోగం చేసి మీరు సంపాదించనంటారు. అంతేనా?"

"అవును. ఉద్యోగం అంటే ఒకడి కింద పనిచేయాలి. వాడు చెప్పినట్టు వినాలి. ఫ్రీడం ఉండదు. అందుకే ఆ ఉద్యోగాలు నేను చేయను."




"డిగ్రీ అయిపోయింది కదా పోనీ పీజీ చేయకపోయారా?"

"ఎందుకు? దాని వల్ల ప్రయోజనం?"

"ఏమో! తెలీదు ఊరికే అడిగాను. సరే... ఉద్యోగం చెయ్యనన్నారు. బాగానే ఉంది. ఏదైనా బిజినెస్ చేసే ఆలోచనలో ఉన్నారా?"

"ఇప్పట్లో లేదు. ముందు లైఫ్ ఎంజాయ్ చేయాలి. ఆపైన అవసరాన్ని బట్టి ఆలోచిస్తాను. అవకాశం లేని వాళ్లకు ఎలాగూ లేదు. ఉన్న అవకాశాన్ని నేను ఉపయోగించుకుంటాను."

ఆపైన కల్పన అతన్నేమీ అడగలేదు.

చంద్రమోహన్‌కు ఇరవై రోజులు గిర్రున తిరిగినట్టుగా అనిపించాయి. ఆరోజు ట్రైనింగ్ ఆఖరిరోజు కావటంతో కొంచెం ఎర్లీగానే సెండాఫ్ ఇచ్చి వదిలేశారు. ఆమె బస్సులో వచ్చింది. ఆ రాత్రి భోజనాల దగ్గర శారద కొడుకు పెళ్లి గురించిన విషయం తీసుకు వచ్చింది. తన కొడుకును చేసుకునే అమ్మాయెవరో అదృష్టవంతురాలని అన్నది. శివరాం కూడా భార్య మాటలతో శ్రుతి కలిపాడు.

నవ్వింది కల్పన.

"మీ ఇంట్లో నీ పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారా?" అనడిగింది ఆమె కల్పనని.

అవునన్నది. కల్పన ట్రైనింగ్‌ని ఇంకో ఇరవై రోజులు పొడగిస్తే బావుండేదనుకున్నాడు చంద్రమోహన్. కల్పన ఆ రోజు మధ్యాహ్నం ట్రైన్‌కు బయల్దేరింది. వాళ్ల దగ్గర సెలవు తీసుకుని. చంద్రమోహన్ ఆమెను స్టేషన్‌కు తీసుకువెళతానన్నాడు. ఆమె ఒప్పుకున్నది. స్టేషన్‌కు వచ్చాక రైలు బయల్దేరటానికి ఇంకో అరగంట టైమున్నది. ఆమె కిటికీ పక్కగా కూర్చుంది. అతను బయట నిల్చుని "మీకో విషయం చెప్పాలి" అన్నాడు.

"చెప్పండి" అన్నది.

"మా ఇంట్లో మనిద్దరికీ పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నారు. అమ్మ నాన్నతో చెబుతుంటే విన్నాను. నాన్న మీ నాన్నగారికి ఉత్తరం రాస్తారుట".

"అలాగా" అన్నది.

"ఇంతకీ మీకు ఇష్టమేనా?"

"లేదు" అన్నది కల్పన వెంటనే.

అతను ఉలిక్కిపడి "ఎందుకు?" అనడిగాడు.

"ఏ పనీ లేకుండా తల్లిదండ్రుల ఆస్తిని తింటూ లేజీగా తిరిగే వాళ్లంటే నాకు అసహ్యం. మగవాడు కష్టపడాలి. సంపాదించాలి. మనిషనే వాడికి ఓ ఉన్నతమైన ధ్యేయం ఉండాలి. ఉద్యోగం చేయకపోయినా కనీసం పోస్టాఫీసు దగ్గర చదువురాని వాళ్లకు ఉత్తరాలు రాసిపెట్టే పనైనా మీరు చేస్తానని ఉంటే సంతోషించేదాన్ని. మీకు ఆపాటి ఆలోచన కూడా లేదు. మిమ్మల్ని చేసుకుంటే రేపు నా ఉద్యోగాన్ని కూడా మాన్పిస్తారు. ఉద్యోగం పురుషలక్షణం అని కూడా తెలీని పురుషుణ్ని ఎలా చేసుకోమంటారు మీరే చెప్పండి చంద్రమోహన్‌గారూ?" అనడిగింది కల్పన.

చంద్రమోహన్ మొహం ఇంకోసారి వెలవెలబోయింది.

★